క్లుప్తంగా

పురస్కారాలతో మరింత బాధ్యత



పుత్ర హనోక్‌కు పురస్కారం అందజేస్తున్న మంత్రి దుర్గేష్

సీటీఆర్‌ఐ: అవార్డులు, పురస్కారాలు బాధ్యతను మరింత పెంచుతాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. స్థానిక బర్మా కాలనీకి చెందిన జేఎస్‌ఎస్‌డబ్ల్యూ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు పుత్ర హనోక్‌కు ఆయన హ్యూమన్ ఎక్సలెన్స్ 2024 విశిష్ట పురస్కారం ప్రదానం చేశారు. మంత్రి నివాసంలో శనివారం రాత్రి ఈ కార్యక్రమం జరిగింది. ఫిలాం ట్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని విశిష్ట పురస్కారం అందించారు. కార్యక్రమంలో ఫిలాం ట్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు అద్దంకి రాజా యోనా పాల్గొన్నారు.

తాగునీటి కుళాయిలు ప్రారంభం



కుళాయిలను ప్రారంభిస్తున్న మదనగోపాలస్వామి

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు పంచాయతీ పరిధిలోని శ్రీదేవి నగర్ బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన పంచాయతీ తాగునీటి కుళాయిలను వేంకటేశ్వర ఫైనాన్స్ అధినేత రావిపాటి మదన గోపాలస్వామి శనివారం ప్రారంభించారు. బీసీ కాలనీలో పైపు లైన్‌ను పంచాయతీ నిధుల నుంచి ఏర్పాటు చేయగా, వాటర్ స్టోరేజీ ట్యాంకును మదనగోపాలస్వామి సమకూర్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి మాతృభాషపై పట్టు అవసరం



శిక్షణలో మాట్లాడుతున్న ఏఎల్ఎస్‌సీ కో ఆర్డినేటర్ కనకబాబు

కడియం: ఒక విద్యార్థి అన్ని సబ్జెక్టులలోనూ మంచి మార్కులు సాధిస్తున్నాడంటే, అతడికి తప్పకుండా మాతృభాషపై పట్టు ఉందని గ్రహించాలని ఏఎల్ఎస్‌సీ జిల్లా కో ఆర్డినేటర్ కనకబాబు అన్నారు. రాజమహేంద్రవరం రూరల్, కడియం మండలాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయులకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి వై.నాగేశ్వరరావు సెకండరీ గ్రేడ్ టీచర్ల శిక్షణ తరగతులను ప్రారంభించారు. హైస్కూలు హెచ్‌ఎం టి.సత్యనారాయణ, సబ్జెక్టు ఆర్పీలు గొల్లపల్లి సత్యనారాయణ, పి.వల్లీతాయారు పలు అంశాలను వివరించారు. సుదర్శన్, శ్రీదేవి తదితర ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో అమలు చేస్తున్న బోధనా విధానాలను వివరించారు. ఉపాధ్యాయులు గ్రూపులుగా ఏర్పడి ఫార్మేటివ్, సమ్మేటివ్ ప్రశ్నాపత్రాలను రూపొందించారు.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సమావేశాలు

కంబాలచెరువు: నూతన విద్యా సంవత్సరంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ప్రారంభమయ్యాయని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ తెలిపారు. స్థానిక బైపాస్ రోడ్డులోని డీఎంహెచ్ స్కూల్లో జరుగుతున్న ప్రాథమిక స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని శనివారం ఆయన సందర్శించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా కాంప్లెక్స్ సమావేశాలు జరగాలన్నారు. ఈ సంవత్సరం ఒకటో తరగతి విద్యార్థులకు ప్రారంభించిన విద్యా ప్రవేశ్ కృత్యాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాలలో రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉంచాలని, ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి మినిట్స్ నమోదు చేయాలన్నారు. డీఎంహెచ్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో మిగిలిన ఉపాధ్యాయులు సోమవారం నెహ్రూనగర్ ఉన్నత పాఠశాలలో జరిగే సమావేశాలకు హాజరై, అక్కడే ఆన్‌లైన్ హాజరు నమోదు చేయాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ కార్యదర్శి పరస జగన్నాథరావు, సీఆర్పీలు జయంతి శాస్త్రి, కోటేశ్వరి, విషయ నిపుణులు వరహాగిరి కృష్ణమోహన్, కె.రాజు, రాధ పాల్గొన్నారు.

ఎస్సైగా ఫణి మోహన్



మధురపూడి: సీతానగరం ఎస్సైగా ఎ.ఫణికుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సఖినేటిపల్లి ఎస్సైగా పని చేసి, స్పెషల్ బ్రాంచ్‌కు వెళ్లారు. అక్కడి నుంచి సీతానగరానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు పోలీసు సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

కోల్‌కతా ఘటనపై వైద్యుల నిరసన

- నిందితులను కఠినంగా శిక్షించాలి
- వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టాలు చేయాలి

కంబాలచెరువు: కోల్‌కతాలో పీజీ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వైద్యులు నిరసన తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో ముందుగా ఇచ్చిన పిలుపు మేరకు రాజమహేంద్రవరం ఏవీఏ రోడ్డు రామాలయం కూడలి వద్ద ఉదయం 10 గంటలకే ఈ కార్యక్రమం మొదలైంది. జిల్లాలోని వివిధ ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ గురుప్రసాద్ మాట్లాడుతూ వైద్యురాలిపై జరిగిన అమానుష దాడిని యావత్ దేశం ఖండిస్తోందన్నారు. వైద్యుడిని భగవంతుడు స్వరూపంగా భావించే ఈ సమాజంలో ఇటువంటి ఘటనలు చోటు చేసుకోవడం శోచనీయమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వైద్యులకు రక్షణ కల్పించేలా ప్రత్యేక చట్టాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.



రాజమహేంద్రవరంలో నిరసన తెలుపుతున్న వైద్యులు

వెలవెలబోయిన ఆసుపత్రులు

వైద్యుల నిరసనతో నగరంలో ప్రైవేటు ఆసుపత్రులతో పాటు ప్రభుత్వాసుపత్రి అయిన జీజీహెచ్ కూడా వెలవెలబోయింది. అక్కడ వైద్యులు కోల్‌కతా ఘటనను ఖండిస్తూ నిరసన తెలిపి అనంతరం యథాతథంగా తమ వైద్య సేవల్లో పాల్గొన్నారు. శనివారం నిర్వహించే కార్యాచరణపై ముందుగానే వైద్యులు నిరసన షెడ్యూల్‌ను ప్రకటించడంతో వైద్యం నిమిత్తం నగరానికి వచ్చే వారు తమ పని వాయిదా వేసుకున్నారు. రాజమహేంద్రవరం జీజీహెచ్లో సైతం ఓపీ నమోదు అంతత మాత్రంగానే ఉంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఓపీ సేవలు పూర్తిగా నిలిచిపోవడంతో రోగులు కొంత అవస్థలు పడ్డారు. అత్యవసర సేవలు మినహా ఎటువంటి సాధారణ వైద్యం అందలేదు. కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా శాఖ అధ్యక్షులు డాక్టర్ వైఎస్ గురుప్రసాద్, కార్యదర్శి పి.విజయ భాస్కర్, డాక్టర్లు కర్రి రామారెడ్డి, సాంబశివ, రామరాజు, అనసూరి శ్రీనివాసు, పద్మజ, లలిత, బిందు, ముత్యాల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

రాజమహేంద్రవరం సిటీ: కోల్‌కతాలో జరిగిన వైద్యురాలి హత్య ఘటనలో నిందితులకు కఠినంగా శిక్షించాలని సామాజిక ఉద్యమ కారుడు డాక్టర్ కార్తీక్ సింగంపల్లి అన్నారు. మానవత్వానికి మచ్చ మిగిల్చిన ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చట్టాలను కఠినంగా అమలుచేయాలన్నారు. విచారణను వేగవంతం చేసి వాస్తవాలను బయటపెట్టాలన్నారు. దోషులను కఠినంగా శిక్షించినప్పుడే మృతురాలి కుటుంబానికి, దేశంలోని మహిళలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రాణాలను కాపాడేందుకు అత్యవసర సేవలు అందించే మహిళా మెడికల్ సిబ్బంది రక్షణ కోసం ప్రత్యేక రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. మహిళలకు పనిచేసేచోట సురక్షిత వాతావరణం కల్పించాలన్నారు.

రక్తదాన శిబిరం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినీ నటుడు చిరంజీవి పుట్టినరోజు వేడుకల్లో భాగంగా రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ ఆధ్వర్యంలో ఉండమట్ల శ్రీరామ్ నిర్వహణలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక సంహిత ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, సినిమాటోగ్రఫీశాఖల మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ యువత క్రమం తప్పకుండా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేసిన మెగా అభిమానులను అభినందించారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, వైఎస్సార్, జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్‌బ్యాంకు చైర్మన్ డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ మాట్లాడారు. అనంతరం అతిథులను శాలువా మెమెంటోలతో ఏడిద బాబీ, ఉండమట్ల శ్రీరామ్ సత్కరించారు. రక్తదానం చేసిన దాతలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న జక్కంపూడి గణేష్, డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ తదితరులు

నామినేషన్ల పరిశీలన పూర్తి

రాజమహేంద్రవరం సిటీ: ది జాంపేట కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ పాలక మండలి ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన పూర్తయ్యిందని ఎన్నికల అధికారి ఎమ్.జగన్నాథరెడ్డి తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ మొత్తం 37 మంది నామినేషన్లు దాఖలు చేయగా, నలుగురి దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించామన్నారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం నియోజకవర్గం -1లో 21 మంది, నియోజక వర్గం-2లో ఇద్దరు, నియోజకవర్గం - 3లో ముగ్గురి దరఖాస్తులను ఆమోదించినట్లు తెలిపారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం 30 మంది పోటీలో నిలిచారన్నారు. వీరిలో ఏడుగురు రెండు సెట్లు నామినేషన్లు అందజేశారని వివరించారు. ఆదివారం దరఖాస్తుల ఉపసంహరణ కార్యక్రమం అనంతరం పోటీలో నిలిచే అభ్యర్థుల వివరాలు ప్రకటిస్తామని ఆయన తెలిపారు.



నామినేషన్లను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి జగన్నాథరెడ్డి

విద్యావ్యాప్తికి చేసిన కృషి అభినందనీయం



శారదా హెచ్ రావు విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం రూరల్: ప్రముఖ సామాజిక సేవకురాలు, విద్యావేత్త, జీఎస్‌కేఎం న్యాయ కళాశాల వ్యవస్థాపకురాలు శారద హెచ్ రావు విద్యావ్యాప్తికి చేసిన కృషి అభినందనీయమని రాష్ట్ర టూరిజం, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ కొనియాడారు. కవలగొయ్యిలోని జీఎస్‌కేఎం లా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శారదారావు విగ్రహాన్ని శనివారం ఉదయం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ శరత్ కృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాలలో మొదటి న్యాయకళాశాల ఏర్పాటుకు శారదారావు కృషి చేశారన్నారు. అనంతరం మేజర్ చల్లా సత్యవాణికి శారదారావు పురస్కారం అందించారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ విద్యార్థులకు న్యాయ విద్యాబోధనలో శారదారావు చైతన్యవంతమైన పాత్ర పోషించారని కొనియాడారు. ప్రముఖ న్యాయవాది, స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థిగా సహకారాలు అందిస్తానన్నారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ ఎందరో న్యాయ విద్యార్థులను అందించిన కళాశాల మరింత అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి దుర్గేష్‌ను కళాశాల యాజమాన్యం తరఫున శరత్ కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీ శ్రీనివాస్ సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎస్.మధుసూదన రావు, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి ఇస్కాన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

సీటీఆర్‌ఐ: ఇస్కాన్ (రాధా గోపీనాథ్ దశావతార మందిర్)లో ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకూ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు శ్యామాంగ శ్రీనివాస్ దాస్ అన్నారు. ఈ మేరకు శనివారం ఇస్కాన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజూ ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు జరగుతాయన్నారు. 19న బలరామ జయంతి సందర్భంగా వివిధ కార్యక్రమాలు, పల్లకీ సేవ, 20 నుంచి 26 వరకూ వివిధ రకాల వాహన సేవలు నిర్వహిస్తామన్నారు. 26వ తేదీ సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా వివిధ పూజలు, 12 గంటలకు పోటీలు, 3 గంటలకు ఉట్టి ఉత్సవం, రాత్రి 10.30 గంటలకు రాధాగోపీనాథులకు మహాకుంభాభిషేకం జరుగుతాయన్నారు. ఇస్కాన్ సంస్థాపకాచార్యులు శ్రీల ప్రభుపాదుల వారి ఆవిర్భావ మహోత్సవం సందర్భంగా ఈ నెల 27వ తేదీ ఉదయం 9 గంటలకు మహా అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. అనంతరం ఈ కార్యక్రమాలకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. హేమ నిమాయదాస్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్యామాంగ శ్రీనివాస్ దాస్ తదితరులు

ఎంపీడీవో రాజ్‌మనోజ్ సేవలు అభినందనీయం



ఎంపీడీవో రాజ్‌మనోజ్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ సత్యప్రసాద్ తదితరులు

కడియం: ఎన్నికల విధుల్లో భాగంగా ఎంపీడీవోగా వచ్చిన జి.రాజ్ మనోజ్ అందించిన సేవలు అభినందనీయమని ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ అన్నారు. బదిలీల్లో భాగంగా మనోజ్ తిరిగి వెనక్కి వెళుతున్న నేపథ్యంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద అభినందన సత్కారం ఏర్పాటు చేశారు.

ఎంపీడీవోతో పాటు0 గ్రేడ్- 2 కార్యదర్శులుగా పదోన్నతులు పొందిన వీరవరం, కడియపుసావరం, మురమండ కార్యదర్శులు వెంకటలక్ష్మి, విజయరాజు, సరోజిని, కార్యదర్శులుగా పదోన్నతి పొందిన కడియం, జేగురుపాడు, దుళ్ల జూనియర్ అసిస్టెంట్లు శ్రీరామచంద్రమూర్తి, సాయిరాం, విజయలక్ష్మిను కూడా ఈ సందర్భంగా సత్కరించారు. ఎంపీడీవో కె.రత్నకుమారి, వైస్ ఎంపీపీ పంతం గణపతి, మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి నాని, జనసేన అధ్యక్షుడు ముద్రగడ జెమి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలను విస్తృతం చేయాలి



ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న భాస్కరరామ్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: రోటరీ క్లబ్ ద్వారా సామాజిక సేవలను విస్తృతం చేయాలని నూతన కార్యవర్గానికి ప్రముఖ ఆడిటర్, రోటరీ డిస్ట్రిక్ట్ 3020 గవర్నర్ వి.భాస్కరరామ్ సూచించారు. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ 2024 -25 అధ్యక్షులుగా బి.లీలా సుభాష్‌రెడ్డి, కార్యదర్శిగా పి.వికాస్, ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణం స్వీకారం చేశారు. స్థానిక ఏకేసీ రోటరీ రివర్ సిటీ హాల్లో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. అధ్యక్షులు బి.లీలా సుభాష్ రెడ్డి మాట్లాడుతూ రోటీ, కపాడా, ఎడ్యుకేషన్ అన్న సంకల్పంతో తమ క్లబ్ ద్వారా ప్రణాళికబద్ధంగా సేవలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో తమ్మబత్తుల రవి, లెఫ్టినెంట్ జాస్తి మూర్తి, నాళం నరసింహారావు, రోటరీ డిస్ట్రిక్ట్ 3020 అసిస్టెంట్ గవర్నర్ పీవీఎస్ఎన్ దొరబాబు, రోటేరియన్లు కంకిరెడ్డి గోపాలకృష్ణ, సుంకర నాగేంద్ర కిషోర్ పాల్గొన్నారు.

వరిపంటపై ఎండాకు తెగులు దాడి

- నివారణ చర్యలు చేపట్టాలి
- ఏరువాక కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ నరసింహారావు

కడియం: ప్రస్తుత సీజన్‌లో కొన్ని ప్రాంతాల్లో వరి పంటపై ఎండాకు తెగులు వ్యాపిస్తోందని, బాక్టీరియా కారణంగా వ్యాపించే ఈ తెగులు నివారణకు రైతులు యాజమాన్య పద్ధతులు చేపట్టాలని జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. మండల కేంద్రమైన కడియంలోని ఆవ ప్రాంతంలో వరి పొలాలను శనివారం జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, ఏడీఏ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకట నరసింహారావు మాట్లాడుతూ వరి సాగులో ఎండాకుతెగులు ఆశించినట్లుగా గుర్తించామన్నారు. నాట్లు వేసిన నెల రోజులకు లేదా ఆ తర్వాత వరి పంటను ఈ వ్యాధి ఆశిస్తుందన్నారు. మడిలో ఆకుల అంచుల నుంచి లోపలి వైపునకు నీటిడాగు మచ్చల మాదిరిగా ఏర్పడి క్రమేపీ పసుపు రంగులోకి మారతాయన్నారు. తెలుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు దుబ్బులోని కొన్ని పిలకలు లేదా దుబ్బు మొత్తం చనిపోతుందన్నారు.



కడియం ఆవలో రైతులతో మాట్లాడుతున్న ఏరువాక కో ఆర్డినేటర్ వెంకట నరసింహరావు, అధికారులు

దీనిని క్రేసక్ దశ అని పిలుస్తారని వివరించారు.

పరిశీలన చాలా అవసరం


చాలా మంది రైతులు ఈ తెగులును కాండం కుళ్లు/ దుబ్బు కుళ్లు తెగులుగా పొరబడి శిలీంద్ర నాశినలను పిచికారీ చేస్తారని, దీని వల్ల తెగులు తగ్గకపోగా రైతులకు పెట్టుబడి ఖర్చులు పెరిగిపోతాయని నరసింహారావు అన్నారు. ఈ తెగులు నిర్ధారణకు ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎండిన ఆకులను ముక్కలుగా కత్తిరించి, మంచి నీటితో ఉన్న గాజు గ్లాసులో వేయాలి. అరగంట తరువాత నీటిని గమనించినట్లయితే, తెగులు ఆశించిన భాగాల నుంచి బాక్టీరియా నీటిలోకి ప్రవేశించడం వల్ల నీటి గాఢత పెరగడం, పసుపు రంగుకు మారడం జరుగుతుంది.

ఈ లక్షణాలను బట్టి ఆ పంటను బాక్టీరియా ఆకుఎండు తెగులు ఆశించినట్లుగా గుర్తించాలి. అదే కాండం కుళ్లు ఆశించిన పిలకలను గమనిస్తే మొదటి కణుపు వద్ద కుళ్లి, మొక్క చనిపోతుంది. అటువంటి పిలకలను చీల్చి చూస్తే మొదటి కణుపు వద్ద నల్లగా మారుతుంది. బాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించిన మొక్కలో ఇటువంటి కుళ్లు లక్షణాలు కనిపించకుండానే పిలకలు ఎండిపోతాయి. ఎడతెరిపి లేకుండా వర్షాలు పడడం, ఉష్ణోగ్రతలు 22-26 డిగ్రీల మధ్య ఉండడం, అధిక నత్రజని వాడకం, నీడ ఎక్కువగా ఉండే ప్రాంతాలు వ్యాధి తీవ్రతను పెంచుతాయి. ఇది సాగు నీటి ద్వారా ఒక పొలం నుంచి మరొక పొలానికి వ్యాపిస్తుంది.

నివారణ చర్యలు

- బాక్టీరియా ఆకు ఎండు తెగులు లక్షణాలు 5 శాతం కంటే ఎక్కువగా ఉంటే, పై పాటుగా వేయాల్సిన నత్రజని ఎరువులను తాత్కాలికంగా నిలిపివేసి, ఎండలు కాసిన తరువాత మాత్రమే వేసుకోవాలి.
- సిఫారసు చేసిన పొటాష్‌ను మ్యూరెట్ ఆఫ్ పొటాష్ రూపంలో రెండు దఫాలుగా నాట్లు వేసే సమయం, చిరుపొట్ట దశలో వేయాలన్నారు. పొలం గట్లపై బాక్టీరియాకు ఆవాసం కల్పించే కలుపు, ఇతర పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి.
- తెగులు లక్షణాలు గమనించిన వెంటనే పొలంలో నిలిచిన నీటిని 2-3 సార్లు మురుగు నీటి కాలువల ద్వారా బయటకు తీసివేసి కొత్త నీరు పెట్టడం వల్ల ఉధృతి తగ్గుతుంది.
- ఈ తెగులు నివారణకు సరైన మందులు అందుబాటులో లేవు, చివరి ప్రయత్నంగా తెగులు వ్యాప్తిని కొంతవరకు అరికట్టడానికి లీటర్ నీటికి 0.5-1 గ్రాముల స్ట్రెప్టో మైసిన్ సల్ఫేట్, టెట్రాసైక్లిన్ హైడ్రో క్లోరైడ్ (ప్లాంటోమైసిన్), కాపర్ హైడ్రాక్సయిడ్ 2 గ్రాములు కలిపి వారం పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.
- అక్కడక్కడా కాండం తొలిచే పురుగు ఆశించినట్లు గుర్తిస్తే, దాని నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా క్లోరాంట్రనిలిప్రోల్ (కారాజేన్) 0.3 మీ.లీ /లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

స్నేహానికి ప్రతిరూపం చంద్రశేఖర్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ అరుణ్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: స్నేహానికి ప్రతిరూపం కొవ్వూరి చంద్రశేఖర్ రెడ్డి అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ కుమార్ అన్నారు. ప్రకాశం నగర్ ధర్మంచర కమ్యూనిటీ హాలు బుక్ బ్యాంకులో శనివారం చంద్రశేఖరరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అరుణ్ కుమార్ మాట్లాడుతూ హైస్కూల్ దశలో స్నేహితుడైన చంద్రశేఖర్ రెడ్డి చివరి వరకు ఆ స్నేహాన్ని ఎంతో ఆత్మీయంగా కొనసాగించాడన్నారు. అలాంటి స్నేహితుడిని కోల్పోవడం తీరని లోటన్నారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ చంద్రశేఖర్ రెడ్డి అజాత శత్రువన్నారు. కార్యక్రమంలో వర్తక ప్రముఖులు అశోక్ కుమార్ జైన్, క్రొవ్విడి సర్రాజు, డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి, డాక్టర్ టి.పతంజలిశాస్త్రి, క్రొవిడి భాస్కరరావు, నక్కా శ్రీ నగేష్, అల్లు బాబి పాల్గొన్నారు.

ఎయిడెడ్ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు

కంబాలచెరువు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం ఎయిడెడ్ పాఠశాలల్లో స్కూల్ యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించినట్లు అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ తెలిపారు. స్థానిక ఆంధ్రనగర్‌లోని పవర్స్ ఎయిడెడ్ ఇంగ్లిష్ మీడియం ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన ఎన్నికల ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఎన్నికైన సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. మొత్తం 21 మంది సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్లను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.పద్మజ తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీ జయంతి శాస్త్రి, ఎన్నికల పరిశీలకులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతోనే లక్ష్యాల సాధన



మాట్లాడుతున్న సినీ దర్శకుడు సందీప్ రెడ్డి

రాజానగరం: ఆత్మస్థైర్యంతో సాధన చేస్తే అనుకున్న లక్ష్యాలను సులువుగా చేరుకోవచ్చని సినీ దర్శకుడు సందీప్ రెడ్డి అన్నారు. స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలలోని సుశృత ఫంక్షన్ హాలులో శనివారం రాజమహేంద్రవరంలోని స్వతంత్ర్య ఆస్పత్రి 38వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సందీప్‌రెడ్డి మాట్లాడుతూ తాను ఫిజియోథెరపీ కోర్సు చేసి, కొంతకాలం ప్రాక్టీసు కూడా చేశానన్నారు. జీఎస్ఎల్ వైద్య కళాశాలలో ఉన్న ఆధునిక సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ వైద్య విద్యను పూర్తి చేసి, సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ రోగికి నమ్మకం కలిగించేలా వైద్య సేవలు అందించాలన్నారు. తొలుత జీఎస్ఎల్ వైద్య కళాశాలలోని అత్యాధునిక వైద్య సదుపాయాలను డాక్టర్ గన్ని భాస్కరరావు, డాక్టర్ గన్ని సందీప్, డాక్టర్ తరుణ్‌లు దర్శకుడు సందీప్ రెడ్డికి చూపిస్తూ, వాటి ప్రత్యేకతలను వివరించారు.

సినిమాలు



శ్యామల : డబుల్ ఇస్మార్ట్
సూర్యమినీ : తంగలాన్
సూర్యప్యాలెస్ : డబుల్ ఇస్మార్ట్
అశోక : ఆయ్
స్వామి : మిస్టర్ బచ్చన్
శివజ్యోతి : మిస్టర్ బచ్చన్
అనుశ్రీ : కమిటీ కుర్రోళ్లు
రాజా : మిస్టర్ బచ్చన్
రంభ : తంగలాన్
ఊర్వశి : డబుల్ ఇస్మార్ట్
మేనక : స్త్రీ – 2, వేదా
కుమారి : డబుల్ ఇస్మార్ట్, మిస్టర్ బచ్చన్
అప్సర : మిస్టర్ బచ్చన్

నామవరం

పీఎస్ మహల్ : డబుల్ ఇస్మార్ట్, మిస్టర్ బచ్చన్

ధవళేశ్వరం

మురళీకృష్ణ : డబుల్ ఇస్మార్ట్, మిస్టర్ బచ్చన్

కడియం

వెంకట సూర్య : డబుల్ ఇస్మార్ట్, మిస్టర్ బచ్చన్